
సాక్షి ప్రకాశం

గురువారం । 27 । మార్చి । 2025



నిబంధనలకు టాటా..సంపద వేట

కనిగిరి నియోజకవర్గంలోని పునుగోడు రిజర్వాయర్‌లో రూ.20 లక్షల విలువైన చేపలను మత్స్యకారులు లీజు ఫీజు కట్టలేదన్న సాకుతో బహిరంగ వేలం వేస్తున్నారు. - 8లో..




వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో..



వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.



న్యూస్‌రీల్

డీఎస్సీ ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణకు రెండో విడత అభ్యర్థులను ఎంపిక చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జాబితాను mdfc.apcfrr.in అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. షెడ్యూల్డు కులాల అభ్యర్థులు 117 మంది, షెడ్యూల్డు తెగల అభ్యర్థులు 65 మంది ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులు తాము శిక్షణ పొందే కోచింగ్ సెంటర్‌లను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 28వ తేదీలోపు ఎంపిక చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు కంప్యూటర్ టెస్ట్ వాయిదా

ఒంగోలు సిటీ: ఒంగోలు ఏబీఎం హైస్కూల్, ముప్పవరంలోని పీఎస్ఎస్‌సీసీ హైస్కూల్, చీరాల రామకృష్ణాపురంలోని ఎంఎస్ హైస్కూల్‌లోని ఎయిడెడ్ పోస్టుల నియామకానికి ఈ నెల 28, 29 తేదీల్లో జరగాల్సిన కంప్యూటర్ టెస్ట్ వాయిదా వేసినట్లు డీఈఓ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గమనించాలన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా కాకుమాను

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా కాకుమాను రాజశేఖర్‌ను నియమించారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

రొయ్యల చెరువుల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని రొయ్యల చెరువుల వద్ద విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని జిల్లా రొయ్యల రైతుల సంఘం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ నేతృత్వంలో రైతులు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లును బుధవారం విద్యుత్ భవన్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఐదు తీరప్రాంత మండలాలు శింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, ఒంగోలు రూరల్ మండలాల్లో రొయ్యల సాగుకు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు సంబంధిత డివిజన్ల ఈఈలతో నేరుగా మాట్లాడారు. రొయ్యల చెరువులకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎస్‌ఈ ఆదేశించారు.

జిల్లా ఫ్యాప్టో చైర్మన్‌గా ఎర్రయ్య



మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ ఎర్రయ్య

ఒంగోలు సిటీ: స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రకాశం జిల్లా నూతన ఫ్యాప్టో ఎన్నికలను బుధవారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకురాలిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల వ్యవహరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య ఫ్యాప్టో చైర్మన్‌గా, సెక్రెటరీ జనరల్‌గా ఎస్.కే.యం.డి రఫీ, కో చైర్మన్‌గా వీ మాధవరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా షేక్ అబ్దుల్ హై, బీ వెంకట్రావు, వై వెంకట్రావ్, వీ జనార్దన్ రెడ్డి, ఏపీటీఎఫ్ సంఘాల నుంచి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ ఎర్రయ్య మాట్లాడుతూ ఏప్రిల్ రెండో తేదీ జరిగే ధర్నాను విజయవంతం చేయాలని, పురుష ఉపాధ్యాయుల మీద పోక్సో కేసులు లేవని డిక్లరేషన్ ఇవ్వాలని సంబంధిత హైస్కూల్ ఉపాధ్యాయుల మీద ఒత్తిడి తేవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రమోషన్ లిస్టులో మెరిట్ కం రోస్టర్ పాటించాలని, వెంటనే ప్రమోషన్ లిస్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ రవి వెంకట్రావు, డీ శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు, చల్లా శ్రీను, సుబ్బారావు, అశోక్, రవిబాబు, చిన్నస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో పచ్చ మాఫియా బరితెగిస్తోంది. గ్రావెల్ అక్రమ తవ్వకాలతో కొండలను కుంటలుగా మార్చేస్తోంది. రూ.కోట్ల విలువజేసే సంపదను కొల్లగొట్టేస్తోంది. మామూళ్ల మత్తులో అధికారులు కళ్లుమూసుకుంటున్నారు. ఇదే అదునుగా అక్రమార్కులు మట్టిని తరలించుకుపోతున్నారు. సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో నిత్యం వందల లారీల్లో మట్టి అక్రమ రవాణా చేస్తుండటంతో కొండలు కరిగిపోతున్నాయి. అధికార టీడీపీకి చెందిన ఒంగోలు, కొండపి నియోజకవర్గాల ముఖ్య నాయకుల కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.



టంగుటూరు మండలంలో తవ్వకాలతో కరిగిన కొండ

కొండలు చదునై.. మట్టి మాయమై..!

- బరితెగించిన పచ్చ మాఫియా
- ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు
- కుంటలుగా మారుతున్న కొండలు
- సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ
- పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కొండపి నియోజకవర్గంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాల కారణంగా కొండలు కుంటలు అవుతున్నా.. కోట్లాది రూపాయల ప్రజాధనం ఆవిరైపోతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే ఎక్కడ బదిలీ వేటు పడుతుందోనన్న భయంతో సంబంధిత శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

కరిగిపోతున్న గ్రావెల్ నిల్వలు...

సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ, సోమరాజుపల్లి, శానంపూడి, కలికవాయ, కనుమళ్ల ప్రాంతాల్లో, టంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొణిజేడు, మర్లపాడు, కందులూరు, యరజర్ల, సర్వేరెడ్డిపాలెం గ్రామాల్లో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. యరజర్ల, మర్లపాడు ప్రాంతాల్లో మైనింగ్ అధికారుల పర్యవేక్షణలోనే ఈ అక్రమ దందా జరుగుతోందని, వారి కళ్లముందే గ్రావెల్ టిప్పర్లు తిరుగుతున్నా వాటిని టచ్ చేసే సాహసం చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సింగరాయకొండ మండలంలో పాతసింగరాయకొండ, శానంపూడి పంచాయతీలోని దేవదాయశాఖ, ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఒక్క కేసు కూడా నమోదు చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ ప్రాంతం గతంలో కొండలతో ఉండగా, నేడు కుంటలు, చెరువులతో దర్శనమిస్తున్నాయి. తవ్వకాలతో భూమి చదును కావడంతో పాటు చాలాచోట్ల ఏకంగా భారీ గుంతలు ఏర్పడ్డాయి.

మామిడి తోటల యజమానుల ఆందోళన...

సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ, శానంపూడి ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ రవాణా కారణంగా ఆ ప్రాంతంలోని మామిడిచెట్లు ఎర్రటి మట్టి, దుమ్ము కొట్టుకుపోతున్నాయి. ఎర్రగా మారి పూత కూడా రాలిపోతున్నాయని మామితోటల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి చెందినవారు కావడంతో ఎవరికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని కుమిలిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నెత్తిచూడని రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలు...

రేయింబవళ్లు అక్రమంగా కొండలను తోడేస్తూ వందలాది లారీల్లో గ్రావెల్, మట్టి తరలించుకుపోతున్నా రెండు మండలాల్లో మూడు శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కొండపి, ఒంగోలు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ ముఖ్య నేతల మధ్య వివాదం తలెత్తడంతో మైనింగ్ అధికారులు యరజర్ల వద్ద అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న టిప్పర్లను పట్టుకున్నారని, వాటిలో కొండపి నేత అనుచరుల టిప్పర్లను పట్టుకుని కేసు పెట్టి రోజుల తరబడి పోలీస్ స్టేషన్‌లో ఉంచారని తెలిసింది. అంతేగాకుండా భారీగా జరిమానా విధించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అందులో ఒంగోలుకు చెందిన టీడీపీ నేత అనుచరులకు చెందిన టిప్పర్లను మాత్రం వదిలేశారని జోరుగా ప్రచారం జరిగింది. ఎక్కడ అక్రమ రవాణాలు జరిగినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా డ్రోన్ ద్వారా, సీసీ కెమెరాల ద్వారా అడ్డుకుంటామని ప్రగల్భాలు పలికే పోలీసులు.. డ్రోన్‌లను పరీక్ష కేంద్రాల వద్ద, బీచ్‌ల వద్ద ఎగరేస్తారే తప్ప అక్రమంగా మైనింగ్ జరిగే ప్రాంతాల్లో, కోడి పందేలు జరిగే ప్రాంతాల్లో, పేకాట కేంద్రాల వద్ద మాత్రం ఎందుకు ఎగరవేయరంటూ ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.



సింగరాయకొండ మండలం మూలగుంటపాడు ప్రాంతంలో గ్రావెల్ నిల్వచేసిన దృశ్యం



సింగరాయకొండ మండలం శానంపూడి ప్రాంతంలో ఎర్రదుమ్ముతో మామిడిచెట్లు

స్థానిక ఉపపోరులో చీకటి రాజకీయం

- బలం లేకపోయినా టీడీపీ అడ్డదారులు
- త్రిపురాంతకం ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు కుయుక్తులు
- బుధవారం అర్ధరాత్రి వరకూ అధికారులతో ఒత్తిళ్లు
- పుల్లలచెరువులో వైస్ ఎంపీపీ ఎన్నిక విషయంలోనూ అదే తీరు
- మార్కాపురంలో అందరూ వైఎస్సార్‌సీపీ వైపే ..



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో రెండు ఎంపీపీలు, ఒక వైస్ ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుడు, నాలుగు ఉప సర్పంచ్ పదవులకు గురువారం ఉప ఎన్నికలు జరగనున్నాయి. బలం లేకున్నా ఎలాగైనా పదవులు కైవసం చేసుకునేందుకు అధికార టీడీపీ నేతలు చేయని కుట్రలు లేవు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని కొంత మంది సభ్యులను ముందుగానే పార్టీలో చేర్పించుకున్నారు. మరి కొన్ని చోట్ల ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపి కుట్రలకు తెరతీశారు. యర్రగొండపాలెం నియోజకవర్గం త్రిపురాంతకం మండలంలో మొత్తం 18 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అందులో 17 స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులు కైవసం చేసుకున్నారు. మేడపి స్థానం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పి.కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొన్ని కారణాలతో ఎంపీపీ తన పదవికి రాజీనామా చేయంతో ఈ క్రమంలో త్రిపురాంతకం ఎంపీపీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. బలం లేకపోయినా ఎలాగైనా ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు టీడీపీ నియోజకవర్గ నాయకుడు అటు పోలీసులను, అధికారులను అస్త్రంగా ఉపయోగించుకుని ప్రతిపక్ష పార్టీ సభ్యులపై ఉసిగొల్పుతున్నారు. అందులో భాగంగానే ఎంపీటీసీ సభ్యుడు, ఎంపీపీ అభ్యర్థి ఆళ్ల ఆంజనేయరెడ్డిపై మూడు రోజుల కిందట ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారు. మరో ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావుపై కూడా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారు. అయితే సుబ్బారావుకు జిల్లా కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన చల్లా జ్యోతి, ఆమె భర్త, మరి కొందరు టీడీపీ మద్దతుతో వేరే వర్గంగా ఉన్నారు. ఎంపీపీ అభ్యర్థిగా చల్లా జ్యోతి పోటీ పడుతున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జ్యోతి, ఆమె భర్త ఎల్లారెడ్డిలను వైఎస్సార్ సీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం ఎన్నికకు సంబంధించి అధికార పార్టీకి తొత్తులుగా మారిన కొంతమంది అధికారులు సభ్యులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుల్లలచెరువు మండలం వైస్ ఎంపీపీ స్థానానికి కూడా ఎన్నిక జరగాల్సి ఉంది. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటిలో 11 స్థానాలు వైఎస్సార్ సీపీ, 4 స్థానాలు టీడీపీ పక్షాన ఉన్నాయి. వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మందా లాజర్ ఎంపీపీగా కొనసాగుతూ అనివార్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. ఈ స్థానంలో వైస్ ఎంపీపీగా ఉన్న కందుల వెంకటయ్య ఎంపీపీ పీఠాన్ని అధిష్టించారు. కూటమి నాయకుడు ఈయనతోపాటు మరొకరి మెడలో పచ్చకండువాలు కప్పి టీడీపీలో చేర్చుకున్నాడు. ఇక్కడ కూడా టీడీపీ కుట్రలకు తెరతీసింది.

మార్కాపురంలో ఏకతాటిపై..

మార్కాపురం మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీలు ఉండగా ఇందులో ఇటీవల నికరంపల్లి ఎంపీటీసీ అనారోగ్యంతో మృతి చెందాడు. గత ఏడాది ఎన్నికల ఫలితాల అనంతరం గోగులదిన్నె ఎంపీటీసీ తమ పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీలున్నారు. ప్రస్తుతం ఇన్చార్జి ఎంపీపీగా ఉన్న వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి లక్ష్మీదేవి ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ కూడా అధికార పార్టీ కుట్రలు చేసినా అవి ఫలించలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న అన్నా రాంబాబు అందర్నీ ఏకతాటిపైకి తెచ్చి లక్ష్మీదేవిని గెలిపించుకునేందుకు కృషి చేస్తున్నారు.

4 స్థానాల్లో ఉపసర్పంచ్‌లకు..

కొండపి మండలం పెరిదేపి గ్రామం, టంగుటూరు మండలం ఆలకూరపాడు, కంభం మండలం తురిమెళ్ల, త్రిపురాంతకం గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. కొండపి మండలం పెరిదేపి గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్ ఇద్దరూ వైఎస్సార్ సీపీ మద్దతుదారులే. అయితే పది మంది వార్డు సభ్యులు ఉండగా వారిలో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ముగ్గురు, సీపీఎం మద్దతుదారులు నలుగురు, టీడీపీ మద్దతుదారులు ముగ్గురు ఉన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి మద్దతు ఇస్తామని సీపీఎం ముందే ఒప్పందం చేసుకుంది. ఈ ప్రకారం మొదటి రెండున్నర సంవత్సరం వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వటంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఉపసర్పంచిగా ఉన్నారు. తాజాగా టీడీపీ అధికారంలోకి రావడంతో వారు టీడీపీ మద్దతుదారులకు సపోర్టు చేసే అవకాశం ఉంది. టంగుటూరు మండలం ఆలకూరుపాడు గ్రామంలో 12 మంది వార్డు సభ్యులు ఉండగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ మద్దతుదారులు చెరి ఆరుగురు అభ్యర్థులు ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఇద్దరూ వార్డు సభ్యులు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ మద్దతుదారుల సంఖ్య ఎనిమిదికి చేరుకుంది.

లక్ష్మీ దర్బార్ !

- దర్శి టీడీపీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్
- హాజరైన అన్నీ శాఖల అధికారులు
- పార్టీ కార్యక్రమానికి అధికారులా అంటూ విమర్శలు



అర్జీలు స్వీకరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

దర్శి: ఆమె ప్రజాప్రతినిధి కాదు..కేవలం అధికార పార్టీ నాయకురాలు.. పార్టీ పరంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి అధికారులు జీ హుజూర్ అంటూ హాజరుకావడం పలు విమర్శలకు తావిస్తోంది. దర్శి నియోజకవర్గానికి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్. ఆయన వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో పెత్తనమంతా టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయిన గొట్టిపాటి లక్ష్మిదే. ఆమె మాటే అధికారులకు వేదం. ఇదిలా ఉండగా దర్శి పట్టణంలో బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు ప్రభుత్వ విభాగాల అధికారులు హాజరయ్యారు. ప్రజాదర్బార్ పోస్టర్లు, బ్యానర్లలో కూడా గొట్టిపాటి లక్ష్మి, ప్రధాని నరేంద్ర మోదీ, ఎన్టీయార్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఫొటోలు వేశారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన కార్యక్రమం అధికారికమా...? పార్టీ కార్యక్రమమా..? అని ఆరా తీస్తే అధికారులు ఇది పార్టీ కార్యక్రమం అని స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమమైతే మీరంతా హాజరుకావడం నిబంధనలకు విరుద్ధం కాదా? అని అధికారులకు ప్రశ్నిస్తే వారి దగ్గర నుంచి సమాధానం లేదు. ఈ కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి అధికారులు హాజరు కావడం గమనార్హం. తెలుగుదేశం పార్టీకి చెందిన వారు మాత్రమే అర్జీలు ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు జనం నుంచి అంతగా స్పందన కానరాలేదు. ఇక్కడ అర్జీలు ఇస్తే సమస్యలు పరిష్కారం అవుతాయా అంటూ ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మితోపాటు నగర పంచాయతీ కమిషనర్ మహేష్, దర్శి తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ ఏడీ కృష్ణారెడ్డి, టౌన్, రూరల్ ఏఈలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం కొసమెరుపు.

దివ్యాంగుల సంఘాలు బలోపేతం కావాలి

- దివ్యాంగుల సమాఖ్య పునరుద్ధరణ సమావేశంలో మెప్మా పీడీ శ్రీహరి



మాట్లాడుతున్న మెప్మా పీడీ శ్రీహరి

ఒంగోలు సబర్బన్: పట్టణ దివ్యాంగుల సంఘాలు బలోపేతం కావటంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు మెప్మా పెద్ద పీట వేస్తుందని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పొట్లూరి శ్రీహరి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంగణంలో బుధవారం పట్టణ దివ్యాంగుల సమాఖ్య పునరుద్ధరణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ దివ్యాంగుల సమాఖ్య పునరుద్ధరణ, మెప్మాలో అమలవుతున్న పథకాలకు దివ్యాంగులకు ప్రథమ స్థానం ఇచ్చారన్నారు. వాటిలో ప్రధానంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో స్వయం ఉపాధి పథకాలు చేనేత రథం, తృప్తి క్యాంటిన్, మొబైల్ క్యాంటిన్‌లు, ఇతర పథకాలు నిర్వహించేందుకు దివ్యాంగులకు ప్రథమ స్థానం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు బ్యాంక్‌ల ద్వారా 33 దివ్యాంగుల సంఘాలకు రూ.2.2 కోట్ల రుణం వారి స్వయం ఉపాధి కోసం మంజూరు చేశామన్నారు. నూతన పదాధికారులు అధ్యక్షులుగా పసుమర్తి రాజేష్, కార్యదర్శిగా యల్లాల శివ కృష్ణారెడ్డి, కోశాధికారిగా అస్మా, సన్మానకర్తలు జొన్న బాలాజీ, మక్కెన సులోచన, వల్లం రెడ్డి, యశోదలు ఎన్నికయ్యారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని గురువారం చీమకుర్తిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామతీర్థంలో రానున్న గంగమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఉప ఎన్నికల్లో గొడవలు సృష్టిస్తే చర్యలు

● ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక


ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: జిల్లాలో పలు స్థానిక సంస్థలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 2 ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ, ఒక కో ఆప్షన్ మెంబర్, 4 ఉప సర్పంచ్ స్థానాల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కాపురం ఎంపీపీ ఎన్నికకు మార్కాపురం సీఐ, త్రిపురాంతకం ఎంపీపీ ఎన్నికకు దర్శి డీఎస్పీ, పుల్లలచెరువు వైస్ ఎంపీపీ, కో ఆప్షన్ మెంబర్ ఎన్నికకు మార్కాపురం డీఎస్పీ, ఉప సర్పంచ్‌ల ఎన్నికకు ఆయా స్టేషన్ల ఎస్సైలను నియమించినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

అశోక్‌బాబుకు నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి


అశోక్ బాబు(ఫైల్)

ఒంగోలు టౌన్: ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్‌బాబుకు నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1991లో ఆర్ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన 1999లో ఆర్ఐగా, 2010లో ఏఆర్ డీఎస్పీగా, 2019లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. 2001 నుంచి 2004 వరకు కాకినాడ ట్రాఫిక్ ఆర్‌గా, 2014 నుంచి 2015 వరకు ఒంగోలు డీటీసీ వైస్ ప్రిన్సిపాల్‌గా, 2015 నుంచి 2021 వరకు ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. 2011 నుంచి ఏఆర్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఇప్పటి వరకు అనేక రివార్డులు వచ్చాయి. నాన్ కేడర్ ఎస్పీ (ఏఆర్)గా పదోన్నతి పొందిన అశోక్ బాబుకు ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందనలు తెలిపారు.

మార్కాపురంలో చైన్ స్నాచింగ్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో బుధవారం వేకువజామున చైన్ స్నాచర్లు రెచ్చిపోయారు. స్థానిక గాంధీ బజారులో నివాసముంటున్న వాడకట్టు రమాదేవి తన ఇంట్లో ఊడ్చిన చెత్తను పడేసేందుకు బుధవారం ఉదయం 5.30 గంటల సమయంలో బయటకు వచ్చింది. అదే సమయంలో ముసుగు ధరించిన ఇద్దరు వ్యక్తులు స్కూటర్‌పై ఆమె వద్దకు వచ్చి పెప్పర్ స్ప్రే కొట్టి మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైను లాక్కెల్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మైనార్టీ సంక్షేమ శాఖ ఇఫ్తార్ విందు

ఒంగోలు వన్‌టౌన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు ఒంగోలు–గుంటూరు రోడ్డులోని పాటిబండ్ల అంజని గోపాల స్వామి కన్వెన్షన్ సెంటర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జె.పార్థసారథి తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ముస్లిం, మైనార్టీలు ఇఫ్తార్ విందులో పాల్గొనాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి



మృతి చెందిన చిన్నబాబు

ముండ్లమూరు(దర్శి): చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు మూర్ఛ రావడంతో వాగులో పడి మృతి చెందాడు. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని తమ్మలూరు పరిధిలో చిలకలేరు వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తమ్మలూరు గ్రామానికి చెందిన మీనిగ చిన్న బాబు (20)అనే యువకుడు గత కొంత కాలం నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో చేపలు పట్టేందుకు చిలకలేరు వద్దకు వెళ్లాడు. సాయంత్రం చీకటి పడుతున్నా ఇంటికి రాకపోవడంతో బంధువులు వెళ్లి వాగు పరిసరాల్లో గాలించారు. వాగు నీటిలో తేలియాడుతున్న చిన్నబాబు మృతదేహాన్ని గుర్తించారు. చేతికంది వచ్చిన కుమారుడు అర్ధంతరంగా తనువు చాలించాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నిబంధనలకు టాటా.. సంపద వేట

పునుగోడు రిజర్వాయర్‌లో చేపలపై కన్నేసిన టీడీపీ నేతలు

● రిజర్వాయర్‌లో ప్రస్తుతం రూ.20 లక్షల విలువైన చేపలు
● మత్స్యకారుల నోట్లో మన్ను కొట్టేందుకు పక్కా స్కెచ్
● లీజు ఫీజు కట్టలేదని సాకుతో 35 ఏళ్ల తర్వాత బహిరంగ వేలం
● టీడీపీ నేతల కుట్రకు నిబంధనల పేరుతో అధికారుల సహకారం




అధికారులు తగిలించిన వేలం పాట నోటీసు

కనిగిరి రూరల్:

అధికార పార్టీ నేతలు సంపద సృష్టి కార్యక్రమంలో భాగంగా అధికారులను అడ్డుపెట్టుకుని ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా, హద్దు మీరి ప్రవర్తిస్తున్నారంటూ అధికారులకు ఓ వైపు కోర్టులు మొట్టికాయలు వేస్తూ చీవాట్లు పెడుతున్నా అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నారు. డబ్బుపై యావ, కుర్చీ స్థాన చలనం కాకూడదనే భయంతో కోసం అధికార పార్టీ నేతలు చెప్పినదానికల్లా ఊ కొడుతూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. ఫలితంగా అర్హులకు అన్యాయం జరుగుతోంది.

'గలీజు' దందా

కనిగిరి నియోజకవర్గంలోని పెద్ద రిజర్వాయర్లలో పునుగోడు ఒకటి. మోపాడు రిజర్వాయర్ తర్వాత పునుగోడులోనే ఎక్కువగా మత్స్య సంపద పెంచుతుంటారు. సుమారు 35 ఏళ్లుగా మత్స్యకార కుటుంబాలే చేపలు పడుతూ జీవనోపాధి పొందుతున్నాయి. గిరిజన జాలర్ల సహకార సంఘ సొసైటీ, పునుగోడు పేరుతో సంఘం కూడా ఏర్పడింది. వీరు ఏటా మత్స్యకార శాఖకు లీజు ఫీజు చెల్లించి చేపలు పడుతుంటారు. లీజుకు సంబంధించిన పెట్టుబడి కోసం జాలర్లకు ఇతరుల సహాయం ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఈ ఏడాది మత్స్యకార సంఘ సభ్యులు లీజు చెల్లించేలా అవగాహన కల్పించి, వారి ఉపాధికి భంగం వాటిల్లకుండా చూడాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహించారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నాయకులు చెరువుపై హక్కులు దక్కించుకునేందుకు తమ కుట్రకు పదునుపెట్టారు. అధికార పార్టీ నేతల గలీజు దందాలో మత్స్యశాఖ అధికారులు పావులుగా మారారు. సొసైటీ లీజు ఫీజు కట్టలేదనే సాకును చూపిస్తూ.. ఎన్నడూ లేని విధంగా 35 ఏళ్ల తర్వాత బహిరంగ వేలం నిర్వాహించేందుకు రంగం సిద్ధం చేశారు.


పునుగోడు రిజర్వాయర్

సంపద కోసం తమ్ముళ్ల 'గాలం'

కనిగిరి నియోజకవర్గంలో ఒక మీడియం(మోపాడు), మూడు మైనర్(పునుగోడు, ఎన్.గొల్లపల్లి, పందువగండి) రిజర్వాయర్లు, ఆరు మండలాల్లో 66 చెరువులు ఉన్నాయి. వీటిలో 61 చెరువులను మత్స్య శాఖ నోటిఫై(చేపల పెంపకానికి అనుకూలంగా, సొసైటీలు ఉన్నవి) చేసినట్లు నివేదికలున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా సొసైటీ సభ్యులకు అనుకూలంగా వారికి ఆదాయం కల్పిస్తూనే చేపల వేట కొనసాగించే ప్రక్రియ ఇప్పటి వరకు సాగుతూ వచ్చింది. ఈ క్రమంలో అంతర్గతంగా ఒప్పందాలు చేసుకున్నప్పటికీ ఫసలీ ఏడాది పూర్తయ్యేక.. ఒప్పంద మార్పిడులు ఉంటాయనేది బహిరంగ రహస్యం. కానీ ఈసారి పునుగోడు రిజర్వాయర్ పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. ఈ రిజర్వాయర్‌లో సుమారు రూ.20 లక్షల విలువైన చేపలు ఉండటంతో అధికార పార్టీ నేతలు తమ సంపద వేటను షురూ చేశారు.

వేలంపై ప్రచారమేది?

అధికార పార్టీ నేతల ఒత్తిడితో పునుగోడు రిజర్వాయర్‌లో చేపల వేటకు ఈనెల 29న బహిరంగ వేలం నిర్వహించాలని మత్స్యశాఖ అధికారులు నిర్ణయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు గ్రామ సచివాలయ నోటీస్ బోర్డులో వేలం కాపీ అంటించారు. అయితే వేలానికి సంబంధించి అధికారికంగా ఏ ప్రక్రియా చేపట్టలేదు. గ్రామంలో దండోరా వేయించలేదు. కనీసం మీడియాకు ప్రకటన ఇవ్వలేదు. వేలం నిర్వహిస్తున్న విషయంపై గ్రామస్తులు, మత్స్యకారులకు అవగాహన కల్పించలేదు. అసలు వేలానికి ఎవరు అర్హులనే విషయాన్ని బహిరంగపరచలేదు. అధికార పార్టీ నేతల ప్రాపకం కోసమే మత్స్యశాఖ అధికారులు రహస్య వ్యవహారాలు నడుపుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారమే చేస్తున్నాం

పునుగోడు రిజర్వాయర్‌లో చేపల వేట బహిరంగ వేలానికి సంబంధించి మాపై ఎలాంటి ఒత్తిడి లేదు. నిబంధనల ప్రకారమే వేలం ప్రక్రియ నిర్వస్తున్నాం. పునుగోడు రిజర్వాయర్‌లో చేపల వేటపై వేలం చరిత్రలో ఇదే ప్రథమం. పునుగోడు గిరిజన జాలర్ల సంఘానికి మూడుసార్లు నోటీసులు ఇచ్చాం. లీజు ఫీజు రూ.1.20 లక్షలు చెల్లించకపోవడంతో ఫసలీ గడువు ముగుస్తున్నందున వేలం పెడుతున్నాం. వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చు. లీజుదారుడికి జూన్ నెల చివరి వరకు మాత్రమే చేపలు పట్టుకునే అవకాశం ఉంటుంది. వచ్చే ఫసలిలో చేపలు పట్టుకునే అవకాశం తిరిగి గిరిజన జాలర్ల సహకార సంఘానికే కల్పిస్తాం.

– రాము, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్

డ్వాక్రా సభ్యుల కుటుంబాలపై సర్వే

● డీఆర్‌డీఏ పీడీ నారాయణ


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలపై సర్వే నిర్వహించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ ఆదేశించారు. బుధవారం ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో డీపీఎంలు, ఏపీఎంలు, ఏసీలు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు, జీవనోపాధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. పీడీ మాట్లాడుతూ.. సంఘ సభ్యులే వారి కుటుంబ ఆదాయ అభివృద్ధి కోసం పెట్టుబడికి రుణ ప్రణాళిక తయారు చేసుకోవడం ద్వారా అవసరమైన సమయంలో రుణాలు పొందవచ్చన్నారు. సభ్యుల వారీగా వాస్తవిక అంచనాల ఆధారంగా వార్షిక రుణ ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన ఉన్న సభ్యులను ఎంపిక చేసి, వారి ద్వారా ఏప్రిల్ 7వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. మండల సమాఖ్య పుస్తకాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ నెలలో అర్హులైన వారికి సిఫ్ రుణాలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో సెర్ప్ మేనేజర్ శ్రీనివాస్, ఐబీ ప్రాజెక్టు మేనేజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు


మృతుడు ఆనందరావు(ఫైల్)



యువకుడి ఐడెంటిటీ కార్డు


గొబ్బూరు వద్ద లక్ష్మీదేవి మృతి చెందిన ఆటో


మద్దిపాడు : తీవ్రంగా గాయపడిన యువకుడు

నాగులుప్పలపాడు/పెద్దారవీడు/మద్దిపాడు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళ, బుధవారాల్లో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. యర్రగొండపాలెం పట్టణానికి చెందిన మానపాటి వెంకటేశ్వర్లు, ఆయన భార్య లక్ష్మీదేవి ఆటోలో కూరగాయలు పెట్టుకొని చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూమాదిరిగానే బుధవారం కూరగాయలు విక్రయించేందుకు భార్యతో కలిసి వెంకటేశ్వర్లు ఆటో నడుపుతూ బయలుదేరాడు. మార్గమధ్యంలో జాతీయ రహదారిపై గొబ్బూరు గ్రామం సమీపంలోకి రాగానే వెంకటేశ్వర్లు డ్రైవింగ్ చేస్తున్న ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మానపాటి లక్ష్మీదేవి(51) అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు స్పందించి తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిది నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామం. దాదాపు ఏడేళ్ల క్రితం యర్రగొండపాలెం పట్టణానికి వచ్చి నివాసం ఉంటున్నారు. కుమారుడు సంపత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.అనిల్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామానికి చెందిన కొమ్మూరి ఆనందరావు(37) మంగళవారం వేకువజామున తన భార్యను తీసుకొని ఉప్పుగుండూరు సమీపంలో శనగ కోతకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి భార్యాభర్తలు ఇరువురు రోడ్డు మార్జిన్‌లో పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆనందరావు మరణించినట్లు బంధువులు తెలిపారు. మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు పెద్ద మనసుతో ఎల్వీ ప్రసాద్ నేత్రాలయానికి దానం చేశారు.

లారీ ఢీకొని యువకులకు తీవ్ర గాయాలు

ముందు వెళ్తున్న లారీని బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం మధ్యాహ్నం మద్దిపాడు మండలంలోని కొస్టాల సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. విశాఖపట్నంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ చదువుతున్న సోహిత్ అతని స్నేహితునితో కలిసి బైక్‌పై అనంతపురం వెళ్తున్నారు. మార్గమధ్యంలో కొస్టాల సెంటర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. స్థానికులు స్పందించి 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఇద్దరు యువకుల్లో ఒకరిది అనంతపురం కాగా, స్నేహితునితో కలిసి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురైనట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన 'చుండూరు'


వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చుండూరు రవిబాబు, భూమిరెడ్డి రమణమ్మ

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

పట్టణాభివృద్ధి సంస్థ వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

● ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్, జేసీ గోపాలకృష్ణ వెల్లడి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ 2025–26 వార్షిక బడ్జెట్‌ను బుధవారం ఆమోదించినట్లు సంస్థ వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రకాశం భవన్‌లోని జేసీ చాంబర్‌లో పట్టణాభివృద్ధి సంస్థ సభ్యులు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. వార్షిక బడ్జెట్‌లోని అంశాలపై సభ్యులతో చర్చించి ఆమోదించినట్లు పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి సంస్థలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్ షిప్స్(ఎంఐజీ లేఔట్లు) ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా చూస్తున్నామన్నారు. పార్కులు, ఇతర ప్రాజెక్టులపై నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

రీ సర్వే పటిష్టంగా చేయాలి

● క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు బాధ్యతగా వ్యవహరించాలి
● జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలయ్యేలా రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద రీ సర్వే, పీజీఆర్ఎస్, పలు రెవెన్యూ అంశాలపై జిల్లాలోని ఆర్డీవోలు, డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్లతో, తహసీల్దార్లతో, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో రీ సర్వే ప్రక్రియ పటిష్టంగా అమలయ్యేలా తహసీల్దార్లు, మండల సర్వేయర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. రీ సర్వే పటిష్టంగా జరిగితే భూ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. మండల సర్వేయర్లు, గ్రామ సర్వే హద్దుల గుర్తింపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూ యజమానికి ముందుగా రీ సర్వే గురించి తెలియజేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు కింద జిల్లాలోని 38 మండలాల్లో 38 గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ఎంపిక చేసుకుని సర్వే ప్రారంభిస్తారన్నారు. ఆర్డీవోల ఆధ్వర్యంలో రీ సర్వే పై ప్రతి గ్రామంలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులను గుర్తించి గ్రామంలోని అన్ని ప్రభుత్వ భూములను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రీ సర్వేకు సంబంధించి ఇచ్చిన ఎస్ఓపీని తప్పకుండా పాటించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ లో వచ్చిన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఆ సమస్యను పరిశీలించి, పిటిషన్‌దారుడితో మర్యాద పూర్వకంగా మాట్లాడి వాళ్ల సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ అధికారి గౌస్ బాషా, జిల్లాలోని ఎమ్మార్వోలు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ శ్లాబులు తనిఖీ


గ్రానైట్ శ్లాబులను కొలత వేస్తున్న మైనింగ్ విజిలెన్స్ అధికారులు

సింగరాయకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నాలుగు రోజులుగా ఆగిఉన్న గ్రానైట్ లారీలోని శ్లాబులను బుధవారం మైనింగ్ ఏడీ రామచంద్రరావు ఆదేశాల మేరకు రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. లారీలోని శ్లాబులను కొలతలు వేసి 5,629 అడుగులు ఉన్నట్లు నిర్ధారించారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వివరించారు. ఈ నెల 22న స్థానిక కందుకూరు రోడ్డులోని ఫ్యాక్టరీ నుంచి మహారాష్ట్రలోని మాలేగావ్‌కు గ్రానైట్ శ్లాబులను తరలిస్తుండగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి మైనింగ్ శాఖకు తెలియజేశారు. కాగా కాటా కోసం వెళ్తున్న సమయంలో అధికారులు సీజ్ చేశారని డ్రైవర్ చెబుతున్నాడు.

ఫుడ్‌పాయిజన్ అవాస్తవం

● మేం ఆరోగ్యంగానే ఉన్నాం..
● సోషల్ మీడియాలో పోస్టులు అవాస్తవమన్న రాచర్ల కేజీబీవీ బాలికలు


విచారిస్తున్న ఎంఈవో శివకోటేశ్వరరావు, డాక్టర్ కమలాదేవి

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సోమవారం రాత్రి భోజనం తింటుంటే సుమారు 25 నుంచి 35 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందని, భోజనం తిని వాంతులు చేసుకున్నారని కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాల్లో పోస్టులు పెట్టారు. ఈ విషయంపై ఎంఈవో–1 శివకోటేశ్వరరావు, అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కే.కమలాదేవి, రాచర్ల హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్ బుధవారం రాత్రి కస్తూరిబా బాలికల పాఠశాలను సందర్శించి తనిఖీలు చేపట్టారు. డాక్టర్ కమలాదేవి పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. పాఠశాలలో చదువుతున్న ముగ్గురు బాలికలకు జ్వరం వచ్చిందని, వెంటనే వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులను ఏఎన్ఎం ఇచ్చారని, ప్రస్తుతం జ్వరం తగ్గిందని డాక్టర్‌కు విద్యార్థులు చెప్పారు. ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని, భోజనం తిని వాంతులు చేసుకున్నారని సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాలకొండమ్మ మాట్లాడుతూ తనపై కక్ష సాధింపుల కోసమే సోషల్ మీడియాల్లో పోస్టులు పెడుతున్నారని, పాఠశాలలో చదివి విద్యార్థులు ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు.

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ నరికితే కఠిన చర్యలు


పెదరాజుపాలెంలో జామాయిల్ తోటలను పరిశీలిస్తున్న సీఐడీ సీఐ, వీఆర్‌ఓ

సీఎస్‌పురం(పామూరు): అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన భూముల్లో జామాయిల్ కర్రను నరికి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐడీ గుంటూరు సీఐ జి.తిరుమల రావు హెచ్చరించారు. మండలంలోని పెదరాజుపాలెంవద్ద సర్వే నంబర్ 29, 31, 32, 33, 34, 59తోపాటు పలు సర్వే నంబర్లలో ఉన్న జామాయిల్ తోటలను ఆయన స్థానిక వీఆర్‌ఓ కె.మాల్యాద్రి, విలేజ్ సర్వేయర్ సుప్రియతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా పామూరు మండలం సిద్ధవరం వద్ద అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ తోటలను వీఆర్‌ఓ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు, పొలాలు సీఐడీ ఆధీనంలో ఉన్నాయని, జామాయిల్ నరికివేతకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.